ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజోలు : అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి మహాసభ సెప్టెంబర్ 8వ తేదీన మలికిపురంలో జరుగుతుందని విద్యార్థి సంఘ నాయకులు తెలిపారు. గురువారం మలికిపురంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ మహాసభలలో విద్యారంగ సమస్యలపై

చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. జిల్లా నూతన కమిటీని ఎన్నిక చేస్తామని అన్నారు. ఈ మహాసభలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని సందేశాలు ఇస్తారని, ఈ సందర్భంగా జరిగే ప్రదర్శన, బహిరంగ సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోనసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ రాపాక మహేష్, విద్యార్థి సంఘాల నాయకులు తాడి సహదేవ్, పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర, నక్క సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : రాష్ట్రంలోనే కాకినాడ లారీ ఓనర్ అసోసియేషన్‌కు మంచి గుర్తింపు ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి ఎంఎస్ రాజు, ప్రసాద్ కుమార్, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మట్ట రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ 60 వసంతాల సందర్భంగా 1256 మందికి లారీ డ్రైవర్లకు యూని ఫాం అందజేశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాకినాడ పోర్ట్‌లో ఎగుమతులు దిగుమతులలో ఈ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో క్రైస్తవులకు ప్రత్యేకస్థానాలు కేటాయించాలి

విశాలాంధ్ర - మండపేట : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు క్రైస్తవులకు ప్రత్యేక అసెంబ్లీ నియోజక వర్గ స్థానాలను కేటాయించాలని క్రిస్టియన్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీజే ఇశ్రాయేలురాజు కోరారు. ఈ సందర్భంగా మండపేటలో క్రిస్టియన్ ఎడిటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవుల వాస్తవ జనాభా ప్రాతిపతికన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి 2024 సార్వత్రిక ఎన్నికల్లో శాసన సభ్యుల సీట్ల కేటాయింపుల్లో తమకు కూడా అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటికే ప్రకటించిన లేదా ప్రకటించనున్న అభ్యర్థులను బిసిసి క్రిస్టియన్లకు కేటాయింపుల ప్రకారం 2 లేక 3 నియోజక వర్గాలను కేటాయించాలని భారత దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

గోల్డ్ మెడల్ గ్రహీత రఘురామ్‌కు సన్మానం

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ సోషల్ వర్క్‌లో గోల్డ్ మెడల్ అందుకున్న ఒమ్మి రఘురామ్‌ను గురువారం సన్మానించారు. ఈ గోల్డ్ మెడల్‌ను రాష్ట్ర గవర్నర్, ఉప కులపతి చేతుల మీదుగా రఘురామ్ అందుకోవడంతో ఆయనను స్వామి వివేకానంద విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇ. చంద్ర నాయుడు సిబ్బంది రఘురామ్‌ను సత్కరించారు. రఘురామ్‌ను జగ్గంపేట వాసులు, మండలంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన అభిమానులు, వివేకానంద సంస్థలో విద్యార్థుల తల్లిదండ్రులు రఘురామ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రఘురామ్ జీవితం పలువురికి ఆదర్శమని, నిబద్ధత గల వ్యక్తి అని, సమయపాలన, క్రమ శిక్షణకు ప్రతీక అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

నెహ్రూను పరామర్శించిన రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర - జగ్గంపేట : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూను రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు అనపర్తి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పరామర్శించారు. తొలుత తోట నాగలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాగలక్ష్మి కుమారుడు నెహ్రూ అల్లుడు తోట సర్వారాయుడుకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యర్రబత్తుల గోవిందు నాయుడు, కొండపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ అర్చకుల క్వార్టర్స్ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకులు వసతి గృహాల సముదాయానికి అమలాపురానికి చెందిన చిక్కం సూరిబాబు, శ్రీలక్ష్మిల తనయుడు సన్ షైన్ ప్రాపర్టీ ఇన్ఫ్రాడవలర్స్ అధినేత చిక్కం పార్థసారథి లక్ష నలభై వేల రూపాయల విరాళాన్ని మీనాక్షి ఫౌండేషన్ అధినేత పినిపే మీనాక్షి చేతుల మీదుగా ఆలయ చైర్ పర్సన్ దూడల విరీతదేవికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విరీతదేవి మాట్లాడుతూ క్వార్టర్స్ నిర్మా ణంలో దాతలు అందరూ భాగస్వామ్యం కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆలయ అభివృద్ధికి లక్షలాది రూపాయలు విరాళాలు ఇస్తున్నారని అన్నారు. చిక్కం పార్థను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి వర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, పట్టణ వైఎస్సార్సీపీ యువత అధ్యక్షులు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : పెదగాడవల్లి మాజీ ఉపసర్పంచ్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు(బుల్లి పెద్దకాపు) కుమారుడు నిమ్మకాయల రామారావు (రాంబాబు - 56) గురువారం గుండె పోటుతో అకాల మృతి చెందారు. రామరావు గ్రామ కమిటీ అధ్యక్షుడుగా పని చేశారు. కుమార్తె కరాటం ప్రసన్న రెడ్డిపల్లి సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. తండ్రి వెంకటేశ్వరరావు మూడు పర్యాయాలు ఉప సర్పంచ్‌గా పని చేశారు. ఈయన బావ కరాటం కొండబాబు(లేటు) భట్నావిల్లి రెడ్డిపల్లి ఉమ్మడి సొసైటీ అధ్యక్షుడుగా పనిచేశారు.రాంబాబు మృతికి మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కరాటం నరసింహారావు, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, సర్పంచ్ పరమట శ్యాంకుమార్, అల్లుడు ఆంధ్రసేవారత్న ఉపాధ్యాయ జెఏసి రాష్ట్ర కార్యదర్శి కరాటం ప్రవీణ్, గుద్దటి వెంకటరత్నం, చిక్కం బాల సందీప్, సిహెచ్ పార్వతి, కరాటం సత్యవాణి, ప్రిన్సిపాల్ కరాటం మనోహర్, ఎన్. బేబీ, ఎన్. పట్టాభి, ఎంపీటీసీ నిమ్మకాయల రాము, గుద్దటి నాగరాజు, జి. నాని, కల్వకొను గోపీ, తిక్క దొరబాబు, సిహెచ్ బాబ్ సాబ్, కె నాని, సిహెచ్ రమేష్, యాలంగి వరప్రసాద్, సంసొన్, సుంకర మోహనరావు, మాజి సర్పంచ్ కరాటం సూర్యభాస్కరరావు, గుర్రాల నాగు, నూకల బాబ్జి, దారపరెడ్డి విశ్వనాథం తదితరులు రాంబాబు భౌతిక కాయం వద్ద పూలమాలలతో నివాళులర్పించారు.

ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలు

విశాలాంధ్ర - అమలాపురం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలలో భాగంగా నాయకులు డిఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో రాజమండ్రి జిఎస్ఎల్ హాస్పిటల్స్ సౌజన్యంతో నల్లా ఇంద్రాణి మోమోరియల్ ట్రస్ట్ (నల్లా శ్రీధర్) సహకారంతో మెగా మెడికల్ క్యాంపు గురువారం ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపు మూడు రోజుల పాటు కొనసాగనుంది. ఈ క్యాంపులో 18 విభాగాలకు సంబంధించిన కౌంటర్లను కోనసీమ ఐఎంఏ అధ్యక్షులు రోహిణీ మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన పురపాలక సంఘం కౌన్సిల్ హాలులో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా కౌన్సిల్ సభ్యులకు, పాత్రికేయ సోదరులకు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, చైర్ పర్సన్ సూర్యవతి రాఖీలు కట్టి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారి 9వ వార్డులో ఓ నిర్మాణం పై ప్లానింగ్ వివరణ కోరగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పిఠాపురం టౌన్ ప్లానింగ్ అధికారికి ముడుపులిస్తే ఏ పనైనా అయిపోద్ది అని పట్టణ 9వ వార్డు కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పిఠాపురం పట్టణం 19వ వార్డులో మసీదు మన్యం బరియల్ గ్రౌండ్ దాతల సహాయంతో మట్టి ఫిల్లింగ్ చేయడం జరిగిందని, టిడిపి కౌన్సిలర్లు అధికారులకు తెలపగా సుమారు పది లక్షల రూపాయలు అంచనా విలువగా ఎజెండాలో పొందుపరచడంపై అధికారులను నిలదీశారు. అధికారులు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని వారు అన్నారు. ఈ విషయంపై టిడిపి కౌన్సిలర్లు డీసెంట్ తెలియజేశారు. పన్నుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని 12వ వార్డు కౌన్సిలర్ బొజ్జ జగదీశ్వరి అధికారులపై మండిపడ్డారు. పట్టణంలో ఆక్రమణల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారి మౌనం వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు.

అరాచకపాలన అంతమే లక్ష్యం

- లోకేష్ యువగళం పాదయాత్రకు అపూర్వ స్పందన

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్రంలో వైసీపీ అవలంభిస్తున్న అరాచకపాలన అంతం చేయడమే తమ లక్ష్యమని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం నాటికి 200 రోజులు,2700 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా లోకేష్ కి సంఘీభావం తెలుపుతూ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని సూర్యారావుపేట లోనీ ఎన్టీఆర్ విగ్రహానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ర్యాలీగా పాదయాత్ర చేపట్టారు. సూర్యారావుపేట నుండి స్థానిక సాయిబాబా ఆలయం,బస్టాండ్,గాంధీ బొమ్మ కూడలి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ గెలుపు తథ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబురాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైమ్ 2.0 రద్దు చేయకుంటే పోరు ఉధృతం

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్ర ప్రభుత్వం అర్థంపర్థం లేని నూతన సాఫ్ట్ వేర్లు విడుదల చేసి ప్రజల జీవితాలతో చెలగాటాలాడుతున్నారని దస్తావేజు లేఖర్లు మండిపడ్డారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సెప్టెంబర్ 5వ తేదీ నుండి నూతన సాఫ్ట వేరు కార్డు ప్రైమ్ 2.0 అమలుచెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన సాఫ్ట్‌వేర్ విధానాన్ని నిరసిస్తూ మండలకేంద్రమైన రాజానగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేకర్లు ఆధ్వర్యంలో గురువారం పెన్ డౌన్ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా రైటర్స్ యూనియన్ అధ్యక్షులు వాడ్రేవు శ్రీనివాస్, దేవలంక సతీష్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేకర్లు కిషోర్,డొంక కిరణ్, కొత్తూరు పోలయ్య, ప్రగాఢ దొరబాబు, కుమార్, పిల్లా వెంకట రాజ, పి.దుర్గబాబు, సిహెచ్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కాకినాడకు రెండో స్థానం గర్వ కారణం

-నేడు పారిశుధ్య కార్మికుల సేవలకు అపూర్వ సత్కారం

-హాజరుకానున్న ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు

-ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి వెల్లడి

విశాలాంధ్ర - కాకినాడ : ఇండియన్ స్మార్ట్ సిటీ అవార్డ్స్-2022లో దేశంలోనే కాకినాడకు రెండో స్థానం దక్కడంలో ప్రధాన భూమిక వహించిన పారిశుధ్య విభాగాన్ని నగర ప్రజల తరపున గౌరవించ నున్నట్లు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి జగన్నాథ పురం నేతాజీ పార్క్ వరకు పారిశుధ్య కార్మికులకు పూలాభిషేకంతో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. దారి పొడవునా వ్యాపారులు, ప్రజలు కార్మికులపై పువ్వులు జల్లి అడుగడుగునా వీరిని గౌరవిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం తన కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమానికి కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్ల, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సహా పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. ర్యాలీ అనంతరం జగన్నాథపురం నేతాజీ పార్క్ వద్ద కేక్ కట్ చేసి కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వి చరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ల ను ఘనంగా సత్కరిస్తామన్నారు. దేశంలోనే రెండో స్థానం దక్కడం కాకినాడకు ఎంతో గర్వకారణమన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైయస్సార్సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్లు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, పలువురు మాజీ కార్పొరేటర్లు నాయకులు హాజరయ్యారు.

నాకాబందీ

విశాలాంధ్ర - కరప : కరప మండలం కరప పోలీస్ స్టేషన్ పరిధిలో నెలాఖరు తనిఖీలలో భాగంగా కరపలో నాకాబంది నిర్వహించినట్టు ఏఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులను, ఆటోలను ఆపి వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని ఏఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. వాహనదారుడు బండికి సంబంధించిన రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలని, పొల్యూషన్ సర్టిఫికెట్, బండి ఇన్సూరెన్స్, వాహనదారుడు లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా మెయింటెన్ చేయాలని వాహనదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని జొన్నాడ సెంటర్ వద్ద 216(ఏ)నెంబరు గల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి మృతి చెందినట్లు స్థానిక ఎస్సై శ్రీను నాయక్ తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన శెట్టి పవన్ కుమార్ (18) అనే యువకుడు తన స్నేహితునితో కలిసి రావులపాలెం వైపు నుండి రాజమండ్రి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జొన్నాడ వద్ద జరుగుతున్న ఫ్లై ఓవర్ పనుల వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ద్విచక్రవాహనం పై ఉన్న పవన్ కుమార్‌ను అదే మార్గంలో వెళుతున్న ట్యాంకర్ వెనుక నుండి బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా పోలీస్ సిబ్బంది, హైవే పెట్రోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.

టీడీపీ ర్యాలీ

విశాలాంధ్ర - అనపర్తి : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాద యాత్ర 200 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక కళ్యాణ మండపం నుండి దేవి చౌక్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం నల్లమిల్లి మాట్లాడుతూ ఏదో విధంగా లోకేష్ పాదయాత్ర అడ్డుకోవాలని వైసిపి ప్రభుత్వం అవాంతరాలు సృష్టించినా 200 రోజులు యువ గళం పాద యాత్ర పూర్తి చేసి సమర్థవంతమైన నాయకులుగా ఎదిగారన్నారు. పప్పు అంటూ అపహాస్యం చేసిన ఈ రోజు నిప్పులా లోకేష్ మారారని నల్లమిల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి శేషారత్నం, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోటలో యువగళం సంఘీభావ పాదయాత్ర

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణంలో పలు ప్రధాన రహదారులలో గురువారం తెలుగు దేశం పార్టీ. నాయకులు, కార్యకర్తలచే యువగళానికి సంఘీభావంగా మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ పాదయాత్ర పొడవునా నినాదాలు చేశారు. నిమ్మకాయల రంగనాథ్, రాజా సూరిబాబు రాజు, అడబాల కుమార స్వామి, కాకినాడ రామారావు, కంటేబాబు, యార్లగడ్డ చిన్నీ, శ్రీకాంత్ ఆకునూరి సత్తిబాబు, కందుల. విశ్వేశ్వర రావు, చల్లాబుజ్జి, పడాల వీరబాబు, కోట అప్పారావులతో బాటు పెద్దాపురం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పొన్నాడ

విశాలాంధ్ర - ముమ్మడివరం : ముమ్మిడివరం మండలం, అయినాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కాట్రేనికోన ఆర్ అండ్ బిరోడ్డు నుండి అయినాపురం బాడవ వరకు ఎపిఆర్ఆర్‌పి (ఎఐఐబి) నిధులు ఒక కోటి 31లక్షలతో,అయినాపురం గ్రామ శివారు కోమటి చెరువుకు సిఎస్ఆర్ ఓన్జిసి నిధులు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్మోహనరెడ్డితోనే సాధ్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డితోనే సాధ్యపడుతుందని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దాపురం పట్టణం లోని 1వ సచివాలయం పరిధిలో 1.2 వార్డు పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాపూజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారదుల మండల కన్వీనర్ గోపు మురళి, సచివాలయ సిబ్బందితో కలిసి గడపగడప మన ప్రభత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడపగడపకు వెళ్ళి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతప్తి వ్యక్తం చేయడంతో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబులు మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల అభివద్ధితో పాటు ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటర్ ఇన్ స్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్ వికడాసరి రాజా, నాగబోయిన రాజుబాబు,లక్కాకుల, కృష్ణ ఎంపీటీసీలు శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, చింతా శ్రీనివాసరావు, సుందరెడ్డి రాజు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

డిసిసిబి ద్వారా రైతులకు రైతు నేస్తం

విశాలాంధ్ర - సీతానగరం: డిసిసిబి బ్యాంకు ద్వారా రైతులకు రైతు నేస్తం అందించినట్లు చీఫ్ మేనేజర్ కార్తీకరెడ్డి అన్నారు. మండలంలో రఘుదేవపురం గ్రామంలో గల డిసిసిబి ద్వారా గురువారం ఇద్దరు రైతులకు రైతు నేస్తం చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ కార్తీక రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించేలా నూతనంగా రైతు నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. దీనిలో భాగంగా ఈ బ్రాంచ్ ద్వారా ఇద్దరు రైతులు డి. నాగ పద్మావతికి రూ.25లక్షలు, కె సత్తిబాబుకు రూ.26లక్షలు ఆర్థిక సహాయం, పది సంవత్సరాల కాలంలో తిరిగి చెల్లించే విధంగా తక్కువ వడ్డీకి రుణం అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సుల్తానా బేగం, పర్యవేక్షణ అధికారులు అలీబాబా, ఎం. రామలింగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అల్లూరి యువజన సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్

విశాలాంధ్ర - అనపర్తి : జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యవర్గ సభ్యులు తేతలి పవన కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అనపర్తి నియోజకవర్గం పరిధిలో రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. రక్షాబంధన్ పురస్కరించుకొని పలువురు మహిళలకు రాఖీ కట్టి, కేంద్ర తంతి తపాలా శాఖ విడుదల చేసిన అల్లూరి స్మారక ప్రత్యేక కవర్లో కొంత నగదును పెట్టి పవన్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు యువసేన గౌరవ అధ్యక్షులు కర్రి ధర్మారెడ్డి (దొరబాబు)ను పవన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అల్లూరి ప్రతిమను బహూకరించారు. ఇటీవల పవన కుమార్ జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యవర్గ సభ్యుడిగా నియమింపబడినందుకు దొరబాబు పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

యువగళంకు టీడీపీ శ్రేణుల సంఘీభావం

విశాలాంధ్ర- పెరవలి : తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి అయిన సందర్భంగా యువగళం పాదయాత్రకు సంఘీభావంగా గురువారం మండలంలోని పలు గ్రామాలలో టిడిపి శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. పెరవలి మండలం కానూరు వై నాట్ ఫంక్షన్ హాల్ నుండి కానూరు, నడుపల్లి గ్రామాల మీదుగా ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. నియోజక వర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెలగన సూర్యారావు, నిడదవోలు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, ఐజమీూ మాజీ చైర్మన్ భూపతిరాజు రవివర్మ ఉండ్రాజవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, పెరవలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అతికాల రామకృష్ణమ్మ (శ్రీను) నిడదవోలు నియోజవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

గృహసారధులే విజయ వారధులు

విశాలాంధ్ర - నిడదవోలు : జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి వివరిం చడం ద్వారా నేటి గృహసారధులే పార్టీ విజయ వారధులని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 13వ సచివాలయం కన్వీనర్లు, గృహసారథిలతో ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న రాష్ట్రఅభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విజయానికి సైనికుల పనిచేయాలన్నారు.అనంతరం గృహసారుదులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఏర్పాటు చేసిన ఇన్సూరెన్స్ పాలసీలను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జి చాంద్ బాషా, మండల ఇన్‌చార్జి వెలగన పొలయ్య,వార్డ్ ఇన్‌చార్జి, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిరథం నిర్వహణకు విరాళం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల మానవతా సంస్థకు శాంతి రథం నిర్వహణ కోసం దేవరపల్లి కి చెందిన జేష్ట వెంకటేశ్వరరావు, జ్యేష్ట సత్యనారాయణ సోదరులు తమ తల్లిదండ్రులైన జేష్ట రంగారావు, పాపయమ్మ దంపతుల జ్ఞాపకార్థం విరాళం అంద జేశారు. ఈ సందర్భంగా మాన వతా సంస్థ మండల అధ్యక్షుడు ఈదుపుగంటి నాగేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ దాతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దాత జ్యేష్ట సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో మానవతా సంస్థకు మరింత సహకారం అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు గద్దె కృష్ణారావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, యలమాటి అక్కిరాజు, ఎల్లమాటి సత్యనారాయణ, బలుసు సత్యనారాయణ, ఈదుపుగంటి నాగేశ్వరరావు పప్పు వెంకట రామారావు, తీగల రాజా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: రాష్ట్రంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వం సమకూర్చుతోందని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు వెల్లడిం చారు. దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జగనన్న ఇళ్ల లబ్ధిదారుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందటానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఇళ్ల స్థలాలలో ఇళ్లు నిర్మించుకోవాలని, నిధులకు కొరత లేదని అన్నారు. ప్రతి ఇంటికి మొదటి దశలో 20,000 రూపాయలు అందజేయనున్నామన్నారు.

వేళాపాళా లేని కరెంటు కోతలు

సతమతమవుతున్న జనం

విశాలాంధ్ర-మండవల్లి: ఆగస్టు నెలలోను మండుటెండలతో జనం అల్లాడుతుండగా వేళాపాళా లేని కరెంటు కోతలతో సామాన్య జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది నెలలుగా విద్యుత్ బిల్లులు వినియోగదారులను కలవరపాటుకు గురిచేస్తుండగా విద్యుత్‌కోతలు తీవ్ర ఇక్కట్లు పాలు చేస్తున్నాయి. పగలు,రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండటం, దోమల బెడదతో కంటి మీద కునుకు లేకుండా కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు దాపురించాయి. గ్రామాల్లోను, మండల కేంద్రాల్లోను ఇష్టారాజ్యంగా కరెంటు కోతలతో వృద్ధులు.చిన్నారులు తీవ్ర ఇక్కట్ల పాలు అవుతుండగా కరెంటు ఎప్పుడు ఉంటుందో తెలియక జనం అగచాట్లు పడుతున్నారు. విద్యుత్ సక్రమంగా అందివ్వలేకున్నా బిల్లులు మాత్రం కన్నీళ్లు రప్పిస్తున్నాయని అదనపు చార్జీల మోతతో జేబులు గుల్ల అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. విద్యుత్ కోతల సమయాన్ని ముందుగానే తెలియచేస్తే కనీసం ఇంటిపనులను సకాలంలో పూర్తి చేసుకుంటామని మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. చరవాణీలకు సైతం చార్జింగులు పెట్ట లేకపోతున్నామని,దుకాణాల్లోకి వినియోగదారులు వచ్చే సమయంలో కరెంటు లేకపోవటంతో వ్యాపారాలు తగ్గుతున్నాయని వ్యాపార వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చే రైతులకు కరెంటు కష్టాలతో నిద్ర లేమితో కొట్టుమిట్టాడుతున్నారు.

రొయ్యల చెరువులో ఎలుకల మందు కలిపిన దుండగులు

విశాలాంధ్ర- భీమడోలు : సాయం పాలెం గ్రామ శివారు ఏడెకరాల రొయ్యల చెరువు లో గుర్తు తెలియని వ్యక్తులు రొయ్యల చెరువులో ఎలుకల మందు కలపడంతో రొయ్యలు మృత్యువాత పడ్డాయి. గమనించిన రైతు భీమడోలు ఎస్ఐ చావా సురేష్‌కు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ జరిగిన విషయాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి నిధితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

లోకేష్ యువగళంలో అల్లర్లు సృష్టించి రాజకీయ లబ్ది

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి ముఖ్యమంత్రి అయ్యారని, నారా లోకేష్ యువ గళం చేస్తున్నాడని పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు జరుగుతుందని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. గురువారం గడపగడప కార్యక్రమంలో నిర్వాసిత గ్రామాలైన సిరివాక, టేకూరు, చీడూరు ,గాజులు గొంది ,కొరుటూరు గ్రామాలలో పర్యటించారు. నిర్వాసిత గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించి ఆ గ్రామాలలో భూ వివాదం లేకుండా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. స్థానిక శాసనసభ్యులపై నిందలు, అసత్యాలు చేయడం సరి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఎం. సూర్య తేజ్, తహసీల్దార్ జి. సుందర్ సింగ్, పోలవరం తహసీల్దార్ సుమలత, ఎంపీడీవో జి. శ్రీను, జీలుగుమిల్లి ఎంపీడీవో కెవిఆర్ కృష్ణ ప్రసాద్, పి ఆర్ డి ఈ శ్రీనివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-ఉండి : ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం బీసీ కాలనీలో శ్రావణమాస మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవం డప్పులు తీన్మార్ గరగలు బుట్ట బొమ్మలు బాణసంచా తో అశేష భక్త జన సంతోషం నడుమ ఆ గ్రామ కమిటీ సభ్యులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీసీ కాలనీ నుండి రాజ వీధుల గుండా ముత్తయిదవులు కలసలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం మరాఠాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాజీ సర్పంచ్ మునుకోలు సింహాచలం, గలవల్లి ధనుంజయ సంఘ పెద్దలు మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం శ్రావణమాస ఆఖరి గురువారం నాడు అమ్మవారికి గ్రామం తరపు నుండి మురాటలు నైవేద్యం సమర్పించుకుంటామని వారు తెలిపారు. కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా గ్రామమంతా ఐక్యంగా ఈ పండగ జరుపుకుంటామని వారన్నారు. ఈ పండగ గ్రామం అంతా ఐక్యంగా చేయడం వలన అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవడం జరుగుతుందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ యువగళంతో వణుకుతున్న వైసీపీ

విశాలాంధ్ర-వీరవాసరం: జగన్ అసమర్థ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్న యువగళం పాదయాత్రతో వైసీపీ నాయకులలో వణుకు మొదలైందని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, వీరవాసరం మండల పార్టీ ఆధ్వర్యంలో యువగళం సంఘీభావ యాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నందమూరిగరువు ఆంజనేయ స్వామి గుడివద్ద నుండి వీరవాసరం సెంటర్ వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించిన అనంతరం టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ తెదేపా యువనేత నారా లోకేష్ 200 రోజులుగా నిర్వహిస్తున్న పాదయాత్ర విజయవంతంగా సాగడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ సెప్టెంబర్ 2న కాకినాడలో టిడిపి అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న జోన్-2 క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ ల సమావేశానికి క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపి నాయకురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో సంఘీభావ యాత్ర నిర్వహిస్తున్నామని నారా లోకేష్ యువగళం పాదయాత్ర త్వరలో ఉండి నియోజకవర్గంలోకి ప్రవేశించి భీమవరం నియోజక వర్గానికి రానున్నట్లు తెలిపారు. వీరవాసరం మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ శారీరిక శ్రమను అలసటను లెక్కచేయకుండా ఉత్సాహంగా స్థానిక ప్రజలతో కలిసి నడుస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆడిదల చిరంజీవి, వీరవాసరం మండల పార్టీ ఉపాధ్యక్షుడు యరకరాజు గోపాలకృష్ణార్జున రాజు, భీమవరం పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, భీమవరం మండల ప్రధాన కార్యదర్శి కౌరు పృథ్వీశంకర్, ఐటీడీపీ అధ్యక్షులు కడలి వాసు, బొడ్డు మోహన్, మరపట్ల శ్యాంబాబు, నాయకులు రొంగల కృష్ణవేణి, మైలబత్తుల ఐసాక్ బాబు, గంట త్రిమూర్తులు, మద్దుల రాము, చల్లబోయిన సుబ్బారావు, పాలా శ్రీరామదాసు, చెల్లబోయిన గోవింద్, మల్లువలస రాము, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర- వీరవాసరం: ద్విచక్ర వాహనదారు లందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పి.రమేష్ తెలిపారు. వీరవాసరం పాలకొల్లు రోడ్డుపై స్థానిక డివైన్ మెర్సీ స్కూల్ వద్ద గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత చర్యలలో భాగంగా హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కలిగిస్తున్నామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించకపోవడం వలన రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కావడంతో మృతి చెందుతున్నారన్నారు. రహదారి ప్రమాదాలలో హెల్మెట్ ధారణ వల్ల మరణాలు తగ్గించవచ్చన్నారు. కావున ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ లేకపోవడం కారణంగా జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించడం జరిగిందని ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైయస్సార్ కంటి వెలుగు ప్రోగ్రాం ద్వారా ఉచితంగా అవసరమైన వారికి కళ్ళకు శస్త్ర చికిత్సలు చేయించనున్నామని జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి పద్మ కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి రాంబాబు నాయక్‌లు అన్నారు. మండల కేంద్రం కిర్లంపూడిలో కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వారిరువురూ వైద్యులు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక సత్యదేవ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కిరణ్ కంటి ఆసుపత్రి సీఈవో దేవరపల్లి జాన్, ఉదయ కుమార్ తమ సిబ్బంది వచ్చి ముందుగా కిర్లంపూడి మండలం నలమూలల నుండి దృష్టిలోపంతో చేరుకున్న వారందరికీ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. 105 మందికి నిర్వహించగా శస్త్ర చికిత్సలకు అవసరం ఉన్న వారిని 53 మందిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెంటకోట నాగబాబు వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, కిర్లంపూడి పిహెచ్‌సి మహిళా వైద్యురాలు టి సాయి హేమాంజలి, విశ్రాంత ఉద్యోగి పెంటకోట మూర్తి, ఎటి రామప్రకాశ్, నైధాన రఘు, దాడి పెదబుజ్జి, దాడి అప్పలరాజు, మళ్ల నాగబాబు, వేగి సాంబశివ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధిచెబుతారు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : టీడీపీ నాయకుడు లోకేష్ చిత్రపటాన్ని ఎమ్మెల్యే ఎలిజా ఆధ్వర్యంలో గాడిద పై ఊరేగించడాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక గంగానమ్మ గుడి వద్ద లోకేష్ బాబు చిత్రపటాన్ని గాడిదపై ఊరేగించిన స్థలంలో పసుపు నీళ్లు, పాలతో శుభ్రం చేశారు. పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతి లేదని టిడిపి శ్రేణులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు టిడిపి నాయకులకు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషును పోలీసులు అరెస్ట్ చేశారు. టిడిపి నాయకులు ఈ అరెస్టును అడ్డుకున్నారు. బలవంతంగా పోలీస్ జీపులో ఎక్కించుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి మీడియా తో మాట్లాడుతూ వైసీపీ నాయకుల అక్రమాలకు అదుపులేకుండా పోతున్నదన్నారు. చేసిన విమర్శలను ధైర్యంగా ఎదుర్కోవాలి గాని ఇలా హేయమైన కార్యాలకు దిగడం సరికాదన్నారు.లోకేష్ యువగళం విజయవంతంగా జరగడాన్ని ఓర్చుకోలేక వైసీపీ నాయకులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయకుదురు హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర-వీరవాసరం: ఉత్తమ ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వివిధ పోటీలలో ప్రతిభ కనబరచి అవార్డులు పొందిన విద్యార్థినులకు గురువారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిసెఫ్, ఎస్సిఇఆర్టి ఆధ్వర్యంలో విజయవాడలో గత నెల 28,29,30 తేదీలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన స్కూల్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాం (ఎస్టిపి)కు ఎంపికై ప్రదర్శన చేసినందుకు గాను విద్యార్థినులు ముంగండ కీర్తన, గుడాల సంహిత, సైన్స్ గైడ్ టీచర్ కె.సూర్యవాణి టీమ్ కన్సోలేషన్ బహుమతి పదివేలు గెలుచుకున్నందుకు, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో కథల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన పంజా బాల శ్రీలక్ష్మి, సామెతలు వ్యాస రచన పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన పుచ్చకాయల వెన్నెలకు వారిని గైడ్ చేసిన ఆర్వేడిబి కుమారిలను ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు అభినందించారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్ల చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజేంద్ర గడ్కర్ వి.శేఖర్, యువి.సుబ్బారాజు, వీరవల్లి నాగేశ్వరరావు అంగర వేణు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు మాజీ ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన దమ్మెన్ను మహిళలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాఖీ పండుగను పురస్కరించుకుని గురువారం మండలంలోని దమ్మెన్ను మహిళలు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు రక్షాబంధనంగా రాఖీ కట్టారు. నారా లోకేష్ పాదయాత్ర చేపట్టి, 200 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన యాత్రకు సంఘీభావంగా నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కానూరు గ్రామం నుండి ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మెన్ను చేరుకున్న శేషారావుకు గ్రామ మహిళలు హారతులిచ్చి, రాఖీ కట్టి తమ అనుబంధాన్ని పంచుకున్నారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖి పండుగ మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంట అన్నా చెల్లెళ్ల, అక్క తమ్ముళ్లతో పండుగ వాతావరణం కనిపించింది. సోదరులు తమ తోబుట్టువుల చేతికి రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో రాఖీ వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: రాఖీ పూర్ణిమ సందర్భంగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో రాఖీపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. దేవరపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ల లక్ష్మి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ద్వారకాతిరుమల మండల మహిళా వైసిపి అధ్యక్షురాలు నాగలక్ష్మి చాపల మేరీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారికి స్వీట్లు తినిపించారు. ఎమ్మెల్యే తలారి వారికి రాఖీ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

విశాలాంధ్ర - పిఠాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన అధిక ధరలు తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు పై ప్రచురించిన కరపత్రాల పంపిణీ ప్రచార కార్యక్రమం అనంతరం ఉప్పాడ బస్టాండ్ వద్ద సభ ఏర్పాటు చేశారు. ఈ సభను ఉద్దేశించి సిపిఎం పిఠాపురం మండల సీనియర్ నాయకులు కోనేటి రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వివిధ ప్రజా సంఘాల నాయకులు, కరణం విశ్వనాథం, భాస్కర్, వీరబాబు, గోపాలకృష్ణ, రమణ అప్పారావు, వనపర్తి సూర్యనారాయణ, ఎస్ సత్తిబాబు నూకరాజు, వి. రాజ, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : అన్నాచెల్లెళ్ళ అనుబంధాన్ని తెలియజేసే రక్షా బంధన్ (రాఖీ) పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోదర, సోదరీమణుల ప్రేమను తెలియజేస్తూ కుటుంబ సభ్యులతో చిన్నారులు ఆనందంగా గడిపారు. దూర ప్రాంతాల్లో ఉన్న అన్న కోసం ఎదురుచూసిన వాళ్ళు కొంతమంది, చెల్లెలు కోసం రాకీ కట్టించుకునేందుకు వెళ్ళిన అన్నలతో కుటుంబాల్లో పండుగ వాతావరణం సంతరించు కుంది. చిన్నా,పెద్దా తారతమ్యం లేకుండా నాటి సాంప్రదాయాన్ని గౌరవిస్తూ రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు సోదర భావం తెలియజేస్తు పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య విద్యార్థులచే రాఖీ కట్టించారు.

ఘనంగా కాపు రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు నల్ల సూర్యచంద్రరావు వర్ధంతి

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరంలోని గోదావరి అక్విడక్టు వద్దనున్న విగ్రహాల పార్కులో కాపు రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు నల్ల సూర్యచంద్రరావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కాపు నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నల్లా పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ తాను పుట్టిన కాపు కులానికి కాకుండా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సేవలందించి పోరాటాలు సాగించిన మహానాయకుడు సూర్యచంద్ర రావు అన్నారు. ప్రభుత్వం అమలాపురంలోని సూర్యచంద్రరావు ఘాట్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోండాడ నాగమణి, మండల వైకాపా అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ భీమాల సూరిబాబు, ఉప సర్పంచ్ కర్రి బాబురావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల అధ్యక్షుడు సాధనాల వెంకట సత్యనారాయణ, దళిత ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు కోట రామ్మోహన రావు, స్థానిక నాయకులు చోల్లంగి సత్తిబాబు, దాసరి కాశి, పుచ్చకాయల నరసింహమూర్తి, కొండ భాస్కరరావు, కోరుకొండ జాన్, నల్లా నరేష్, నల్లా సత్యనారాయణ, పెదకాపు, మడిమెట్ల శేఖర్, నల్లా బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభ విద్యాలయంలో స్కూల్ లెడ్ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం శ్రీ ప్రతిభ విద్యాలయంలో ఘనంగా గురువారం ఎస్ఎల్‌సి స్కూల్ లెడ్ కాన్ఫరెన్స్ జరిగింది. చిన్నారుల అత్యుత్తమమైన విద్యను అందించడానికి లెడ్ పవర్ రెడ్ స్కూల్ అకాడమీ ఎక్సెలెన్స్ సిస్టంను అనుసంధానించి కృత్యాధార బోధన ద్వారా నేర్చుకున్న కృత్యములు అన్ని విద్యార్థుల తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రతిభ విద్యాలయం అధినేత దాసం శేషారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సత్ప్రవర్తనతోనే మంచి విద్యార్థినులు తయారవుతారని, విలువలతో కూడిన విద్యనందిస్తూ వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రయోజకులుగా తయారు చేయడమే ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. లీడ్ కోఆర్డినేటర్ రాణి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సరళమైన రీతిలో ఇంగ్లీష్ భాషను ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ జనరల్ ఎవేర్నెస్ అనే సబ్జెక్టును సింగపూర్ నూతన విధానంలో బోధిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయభూమిపూజ

విశాలాంధ్ర-తణుకు : నియోజకవర్గంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయ భూమి పూజా కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు పాల్గొన్నారు. ఆయన వెంట జనసేన పార్టీ తూర్పు విప్పర్రు గ్రామం సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ,ఉప సర్పంచ్ చిన్న నాగేశ్వరరావు, ఇరగవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు ఆకేటి కాశి,తూర్పు విప్పర్రు గ్రామం జనసేన పార్టీ అధ్యక్షులు కటికి రెడ్డి శ్రీనివాస్,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఫాస్ట్రాక్ నూతన ప్రచార కర్తగా నటుడు విజయ్ దేవరకొండ

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశపు ప్రతిష్టాత్మకమైన వాచ్ యాక్సెసరీస్ బ్రాండ్ ఫాస్ట్రాక్ తమ కొత్త బ్రాండ్ ప్రచారం 'బీ బోత్'తో ముందుకు రానున్నట్టుఫాస్ట్రాక్ కోఆర్డినేటర్ చెప్పారు. ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫాస్ట్రాక్ బ్రాండ్ అంబాసిడర్‌గా కనిపించనున్నారన్నారు. సూక్ష్మ నాటకీయత, పూర్తి ఉల్లాసం, సొగసరి మరియు అనుచితమైన ప్రత్యేక ఫ్యాషన్ వైరుధ్యాల శ్రేణితో కూడిన యువత జీవితాల్లో విభిన్న వాస్తవాల కలయికను ప్రచారం హైలైట్ చేస్తుందన్నారు. ఈ బ్రాండ్ తమ వినియోగదారులను నిస్సంకోచంగా "బీ బోత్" అని ప్రేరేపించడం వారి వైరుధ్యాలను ఉల్లాసంగా ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఈ ప్రచారం 15 విశిష్టమైన వాచీల కలెక్షన్‌ను హైలైట్ చేస్తుందని తెలిపారు.

ఉప్పాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న కన్నబాబు

విశాలాంధ్ర - కరప : శ్రావణ పౌర్ణమి సందర్భంగా కరప ఉప్పాలమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన కుంకుమ పూజ కార్యక్రమంలో కాకినాడ రూరల్ శాసన సభ్యులు మాజీ మంత్రి కురసాల కన్నబాబు పాల్గొని ఉప్పాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సాగే ఆశాజ్యోతి కుమార్ ఎమ్మెల్యే కన్నబాబుకు రాఖీలు కట్టి అన్నా చెల్లెలు అనుబంధాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాఖీ పండుగ సోదరి భావాన్ని, సహోదర ప్రేమను, మనుషుల మధ్య ప్రేమానురాగాలను గుర్తు చేస్తుందని తెలిపారు. 200 మంది మహిళలు కలశాలుతో ఏర్పాటు చేసిన పూజలో కన్నబాబు దంపతులు పాల్గొని తరించారు. అనంతరం గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వై సుబ్బారావు వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు, గొర్రెల వెంకన్న, ముద్రగడ వీరబాబు, నక్క వీరభద్రరావు నక్క సత్తిబాబు, నక్క చిన్న తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కన్నబాబు జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి హ్యాట్రిక్

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముచ్చటగా మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా రావడం ఎంతో ఆనందమని ప్రముఖ న్యాయవాది వైసిపి స్టేట్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పులగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రెస్ క్లబ్ ఆఫ్ కోకనాడ రూరల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబుకు క్లబ్బు లీగల్ అడ్వైజర్ రామకృష్ణారెడ్డి మరియు క్లబ్ సభ్యులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పులగం రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు స్థాయి నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా అంచె లంచెలుగా ఎదిగారని తెలిపారు. 2016లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడిగా రావడం, 2019 ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంలో ముఖ్య పాత్ర వహించారని అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబు అత్యంత మెజార్టీతో గెలుపొందుతారని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆఫ్ కోకనాడ రూరల్ అధ్యక్షులు బిందాన సురేష్,మాజీ అధ్యక్షులు బివి భాస్కర్, చిన్న పత్రికల సంక్షేమ సంఘం ప్రతినిధి రాయవరపు ప్రభాకర్, క్లబ్బు అధ్యక్షులు వీవీఎస్ ప్రకాశరావు, కార్యదర్శి వీర సరేంద్ర కుమార్, సీనియర్ పాత్రికేయులు పిచ్చుక రఘు, గుబ్బల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

"వికాస" లో2న ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో సెప్టెంబర్ 02వ తేదీ శనివారం "ఎంఎస్‌సి టైర్ మ్యానిఫ్యాక్చరింగ్" కంపెనీలో టెక్నిషియన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగానికి డిప్లొమో ఆల్ ట్రేడ్స్ (సివిల్ తప్పా) ఉత్తీర్ణులైన 24 సం.ల్లోపు పురుష అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ. 14,610/- జీతం + భోజనం, రవాణా సౌకర్యం ఉంటుంది. ఈ ఉద్యోగానికి ఎంపికైన వారు నెల్లూరు (శ్రీసిటీ)లో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ సెప్టెంబర్ 02వ తేదీ శనివారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్సులతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్ : 7799376333 సంప్రదించవలెను.

దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర కీలకం

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే బ్యాంకింగ్ వ్యవస్థ అత్యంత ముఖ్యమని,దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర ఎంతో కీలకమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆధునికీకరించిన విశ్వవిద్యాలయ శాఖను కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు విశ్వవిద్యాలయ విద్యార్థిని విద్యార్థులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, భారతదేశ జనాభాలో 60 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారని, వారి మేధోశక్తికి

తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ క్యాంపస్ లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి స్థాయి బ్యాంకు శాఖగా రూపుదిద్దుకోవడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. గతంతో సరిపోల్చితే, జిల్లాల పునర్విభజన అనంతరం కృష్ణాజిల్లా గణనీయంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, వందల ఏళ్ల చరిత్ర ఉన్న మచిలీపట్నం పోర్టు పనులను వేల కోట్ల రూపాయలను కేటాయించి ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించడం ఎంతో విప్లవాత్మకమైన పరిణామమని అన్నారు, అలాగే సెప్టెంబర్ మొదటి వారం నుంచి మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావడం ఎంతో శుభ సూచికమన్నారు. కృష్ణా విశ్వ విద్యాలయంలో ఉద్యోగ ఉపాధి ఆధారిత కోర్సులను ప్రారంభించాలని కలెక్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు సూచించారు. మచిలీపట్నం పోర్టు ద్వారా పలువురికి ఉపాధి లభిస్తుందని పోర్ట్ ట్రాన్స్ పోర్ట్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, ఆక్వా, మెరైన్ ఎక్స్ పోర్ట్ డెవలప్మెంట్ మేనేజ్మెంట్ తదితర కోర్సులను కృష్ణా విశ్వ విద్యాలయంలో ప్రవేశపెడితే మిగతా యూనివర్సిటీల కన్నా భిన్నంగా ఉంటుందని పలువురు విద్యార్థులు ఆయా కోర్సులను అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపుతారని కలెక్టర్ అన్నారు. మచిలీపట్నం నుంచి యూనివర్సిటీకి వచ్చే రహదారులకు మహర్దశ పట్టనుందని, ఆయా రోడ్ల నిర్మాణం ప్రస్తుతం టెండర్ ప్రక్రియ దశలో ఉన్నాయని త్వరలో యూనివర్సిటీకి మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడనున్నట్లు విద్యార్థిని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య కలెక్టర్ పి. రాజాబాబు ప్రకటించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధునికమైన బ్యాంకు సేవలను కృష్ణా విశ్వవిద్యాలయంకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగులతో పాటు పరిసరాల్లోని, ఆక్వా రైతులు, ప్రజలు కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి, రిజిస్టర్ ప్రొఫెసర్ ఎం.రామిరెడ్డి, రెక్టర్ ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు, మచిలీపట్నం తహసిల్దార్ శ్రీవిద్య, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ విజయవాడ మనీష్ కుమార్ సింగ్, రీజనల్ మేనేజర్ ఫణి రామ్ కుమార్, చీఫ్ మేనేజర్ మచిలీపట్నం మెయిన్ బ్రాంచ్ కె.రామారావు, చీఫ్ మేనేజర్ క్రెడిట్,ఎన్ పిఏ టి. ఏసు పాదం, చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) మురళీధర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.